ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 21-3-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గురువు తన శక్తిని కొంత పంపించి తద్వారా భక్తుడికి ఆత్మానుభవం తీసుకువచ్చే అవకాశం ఉందని చెపుతున్నారు. ఇది ఎంతవరకు నిజం అని భగవాన్‌ను అడిగారు. గురువు ప్రత్యేకంగా శిష్యుడికి ఆత్మజ్ఞానాన్ని ఇవ్వడు. అతనికి ఆత్మానుభవం కలగటానికి ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో వాటిని తొలగిస్తాడు. మనం అంతా జ్ఞానములోనే ఉన్నాము అని భగవాన్ చెపుతున్నారు. మనకి ఆత్మానుభవం లేదు కాబట్టి నేను అంటే శరీరం అని కొందరు, మనస్సు అని కొందరు, ఇంద్రియాలు అని కొందరు అనుకొంటున్నారు. రంగుతోటి, కులంతోటి కొంతమంది తాదాప్యం చెందుతున్నారు. నేను ఎవడను? అనే ప్రశ్నకు సమాధానం జ్ఞానంఅనే.

మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను నేనుఅయితే అంటే ఆనేను నిజమైన నేను అయితే శ్రవణంతోటి, ధ్యానంతోటి, విచారణతోటి పనిలేదు. ఏదైతే నేను, నేను అంటున్నామో ఆనేను నేను కాదు. నేను కాని నేనును నేను అనుకొంటున్నాము. అందువలన శ్రవణం, ధ్యానం చేయమంటున్నారు. నేనుకాని నేనును నేను అనుకొన్నంతకాలము పునర్జన్మలు వస్తూ ఉంటాయి. ఈ నేను దేహం లేకుండా, ప్రపంచం లేకుండా ఉండలేదు. నీవు ఆత్మగానే ఉన్నావు కాని నీకు ఆత్మానుభవం లేక గురువును ఆశ్రయిస్తున్నావు. ఆత్మానుభవం కలగటానికి ఏ ఆటంకాలు అయితే నీకు ఉన్నాయో వాటిని తొలగించటానికి ప్రయత్నం చేసేవాడే గురువు. దీనికి శాంతి, శ్రద్ధ ఇవి రెండూ ముఖ్యం. ఇవి రెండూ గురువు వలన మనకు కలుగుతాయి. ఎవడికైతే ఆత్మజ్ఞానము సంపాదించాలనే కుతూహలం కలుగుతుందో వాడికి శాంతి, శ్రద్ధ వస్తాయి. శాంతి, శ్రద్ధ లేనివాడు దేనిని సాధించలేడు. అతిగా నిద్రపోయేవారు, తొందరగా ఉద్రేకపడేవారు ఈలోకంలోగాని, పరలోకంలోగాని అభివృద్ధిలోనికి రావటానికి అవకాశము లేదు. నీవు ఆత్మఅయి ఉన్నావు. నీవు ఎవరుగా ఉన్నావో ఆ వస్తువుకు సంబందించిన అనుభవం నీకు లేదు. నీకు అనుభవం లేకపోయినా నీవు అదే. దానికి సంబంధించిన అనుభవం రావటంకోసం ఏ సంస్కారములు అయితే నీకు అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించుకోవటానికి తగినశక్తిని, శ్రద్ధని, విశ్వాసమును నీలో కలిగింపజేసి నీలో ఉన్న బలహీనతలు తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నానికి సహాయ సహకారములు అందించేవాడే గురువు.

కొన్ని వాసనలు తొందరగా పోవు. వాసన పోవాలంటే స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరానుగ్రహం అవసరము. మనం ప్రయత్నం చేయాలి. కాలం కలిసివచ్చినపుడు ఈశ్వరానుగ్రహం వస్తుంది. ఈశ్వరానుగ్రహం వస్తుందా, రాదా అని అనుమానం వద్దు. అనుగ్రహం వస్తుంది. అనుగ్రహం రాగానే వాసన ఎంత బలీయమైనది అయినా అది తొలగించబడుతుంది. నీ సాధనవలననే ఆ వాసన తొలగించబడదు, ఈశ్వరానుగ్రహంవలన తొలగించబడుతుంది. ఈశ్వరానుగ్రహం అనే కెరటం వచ్చి మన హృదయానికి తాకినపుడు ఇది మన తెలివితేటలవలన రావటం లేదు, మన ప్రయత్నంవలన రావటం లేదు. ఈ చల్లటి పవనాలు ఈశ్వరానుగ్రహంవలన వస్తున్నాయి, బలహీనతలను జయించే శక్తి దానివలననే కలుగుతోంది,

ఇది అంతా ఈశ్వరానుగ్రహంవలననే చేస్తున్నాము అని స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. ప్రపంచంలో ఉన్న ఐశ్వర్యం అంతా నీ వడిలో పోసినప్పటికీ ఈ ఐశ్వర్యంకంటే ఈశ్వరానుగ్రహం ఎక్కువైనది అన్న సంగతి నీగుండెకు తడుతూ ఉంటుంది. ఇది పరోక్షానుభవం కాదు. ఇది ప్రత్యక్షానుభవం.

గురువు అనుగ్రహం లేకుండా ఆత్మను పొందలేమా అని అడుగుతున్నారు. గురువు అంటే ఆత్మే. ఆత్మ నీ హృదయంలోనే ఉంది. నిన్ను అంతర్ముఖం చేయటానికి ఆత్మే గురురూపం ధరించి వచ్చింది. బాహ్యంగా ఉన్న గురువు నిన్ను అంతర్ముఖం చేస్తాడు. నీ మనస్సు కొంచం అంతర్ముఖం అయిన తరువాత లోపల ఉన్న గురువు నిన్ను లోపలకు గుంజుకొంటాడు. ఆ గురువు, ఈ గురువు ఒక్కటే. మీరు ఎప్పుడూ ప్రయత్నం చేయాలి అనుకోనక్కరలేదు. కొంతవరకే మీ ప్రయత్నం. లోపల గురువుయొక్క చేతికి మీ మనస్సు అందిన తరువాత అప్పుడు మీరు చేయటానికి ప్రయత్నం అంటూ మిగలదు. తరువాత పని ఆయనే చేసుకుపోతాడు. ఇప్పుడు ప్రయత్నం చేయకుండా ఉండలేరు. కొంతదూరం వెళ్ళిన తరువాత ప్రయత్నం చేయటానికి ఏమీ ఉండదు. అందుచేత ఈ కష్టం ఎప్పుడూ ఉంటుంది అని అనుకోకండి. కొంతకాలమే ఉంటుంది. ఆత్మజ్ఞానము సంపాదించటానికి గురువు అవసరమా అని అడుగుతున్నాడు. ఆత్మజ్ఞానము సంపాదించాలన్న కోరికకూడా గురువు అనుగ్రహం లేకుండా రాదు అని వాడికి తెలియటం లేదు. ఆత్మానుగ్రహంవలననే ఆత్మను తెలుసుకోవాలి అనే కాంక్ష కలుగుతుంది. ఆ కాంక్ష కలిగినవారు అందరూ ఒడ్డుకు చేరుకోలేరు. కొంతమంది తీవ్రంగా సాధన చేస్తున్నారు అనుకోండి. సాధనచేసేవారు అందరికి ఆత్మ తెలుస్తుంది అని చెప్పలేము. వారిలో ఆత్మ ఎవరికైతే తెలియబడాలి అని అనుకొందో వారికి మాత్రమే తెలియబడుతుంది. అప్పుడుకూడా జడ్జిమెంట్ ఆత్మ తన చేతిలోనే పెట్టుకొంటుంది.

ప్రకృతిలో అనేక ఆకర్షణలు ఉంటాయి. ఏ ఆకర్షణకు కొట్టుకొనిపోయినా అది తెలియబడదు. తన బుద్ధిసూక్ష్మత వలన, వివేకంవలన ఎవడైతే ఈ లోకములో ఉన్న ఆకర్షణలను దాటుతున్నాడో వాడికిమాత్రమే బ్రహ్మం ఎరుకపడుతుంది అని యముడు చెప్పాడు. ముక్కులో గాలి తిరగటంవలన మేము బ్రతుకుచున్నాము అని అందరూ అనుకొంటారు. ఈ ముక్కులో గాలి నియమించేవాడు నీలోపల ఒకడు ఉన్నాడు. ఆ నియమించేవాడిని బట్టి మీరు బ్రతుకుచున్నారు గాని ముక్కులోగాలి తిరగటంవలన మీరు బ్రతకటం లేదు. ఆ నియమించేవాడు మీ ముక్కులో గాలిని ఎప్పుడు ఆపుచేయాలంటే అప్పుడు ఆపుచేస్తాడు. ఈ గాలి ఎవడి కంట్రోలులో ఉందో వాడివలన మీరు బ్రతుకుతున్నారు అని యముడు చెప్పాడు. గురువు సహాయం లేకుండా ఆత్మానుభవం కలుగదు. ఏదైనా **Subject** నేర్చుకొనేటప్పుడు చెప్పేవాడు ఉంటే వాడిదగ్గర నేర్చుకోవటం మంచిది. చెప్పేవాడు ఉంటే ఎక్కువ కష్టపడనక్కరలేదు. అర్థమయ్యేటట్లు చెప్పే గురువు నీకు ఉన్నప్పుడు శ్రమ ఎక్కువ లేకుండానే నీవు దానిని పొందుతావు. అటువంటి గురువు నీకు లభ్యం కాలేదు అనుకో నీకష్టం నీకు ఎలాగూ ఉంటుంది.

మీలోపల ఉన్న గురువు మీ హృదయంలో ఉన్న ఆత్మసుఖాన్ని ఒక్కసారి రుచి చూపించి వదిలివేస్తాడు. ఆ వస్తువు దగ్గరకు వెళ్ళే అర్హత, యోగ్యత మీకు లేకపోయినా ఆ వస్తువును పొందాలి అనే తాపత్రయం మీకు కలుగజేయటంకోసం ఆ రుచిని ఒక్కసారి చూపిస్తాడు. ఆ రుచి మీకు తెలిసిన తరువాత దానిని పొందాలి అనే కాంక్ష మీకు వస్తుంది. తలనొప్పి వస్తే దానిని పోగొట్టుకోవటంకోసం మనం ప్రయత్నం చేస్తాము. తలనొప్పి ఉంటే నష్టం ఏమిటి చెప్పండి. తలనొప్పి లేనపుడు సుఖంగా ఉన్న స్థితిని ఒకదానిని మనం అనుభవించాము. తలనొప్పి వచ్చాక ఆ సుఖం పోయింది. తలనొప్పి తగ్గిపోతే మరల పూర్వసుఖం దొరుకుతుందికదా అనే ఉద్దేశ్యంమీద తలపోటు తగ్గించుకోవటానికి ప్రయత్నం చేస్తాము. మానవునికి

కావలసినది సుఖం. అహంభావన రాకముందు నిజమైన సుఖాన్ని మనం అనుభవించాము. ఇప్పుడు ఆ సుఖాన్ని పొందలేకపోతున్నాము. ఆ సుఖం నీ హృదయంలోనే ఉంది. అహంభావన రాకముందు ఏ సుఖాన్ని అయితే అనుభవించావో ఆ సుఖాన్ని పొందటంకోసం అహంభావనను పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావు.

కొంతమంది పనిచేస్తారు. ఆశ ఉండదు. వారు ఉత్తములు. ఆశ లేకుండా పనిచేస్తే దానివలన ఏదైనా వచ్చినా అది నిన్ను బంధించదు. కొంతమంది పనిచేస్తారు, ఆశ ఉంటుంది. ఆశకు తగ్గపనిచేస్తారు. కొంతమందికి ఆశ ఉంటుంది కాని పనిచేయరు వీరివలన ప్రమాదము. నీవు ప్రయత్నం చెయ్యి. నీవు చేసే ప్రయత్నమే అనుగ్రహంగా మారిపోతుంది. భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ప్రయత్నం చెయ్యి నీకు దొరుకుతాడు.

మనం అజ్ఞానంలో ఉన్నంతకాలము దేహబుద్దిలో ఉంటాము. దేహమునకు పరిమితమై ఉంటాము. అజ్ఞానము నశించినపుడు దేహబుద్ధి నశిస్తుంది. అజ్ఞానము నశించిన తరువాత ఉన్నది ఒకటే. రెండు ఉన్నప్పుడు అన్నీ వస్తాయి. మాయ అనేది ద్వైతంలో ఉంది, బేధబుద్దిలో ఉంది. మాయ భగవంతుని చేతిలో ఉంది కాబట్టి భగవంతుని ఆరాధిస్తే మాయ మనకు దారి ఇస్తుంది. నేను నాలుగు మాటలు చెపుతున్నాను, మీరు వింటున్నారు. ఇది పూజ అనే భావనతో నేను చెప్పాలి, పూజ అనే భావనతో మీరు వినాలి. అలా చేస్తే మాయ మీకు దారి ఇస్తుంది, నాకు దారి ఇస్తుంది. దేవుని గురించి చెపుతున్నాను అనే భావన నాకు, దేవునిగురించి వింటున్నాము అనే భావన మీకు ఉంటే ఇదే పూజ అవుతుంది. ఉన్నది ఒక్కటే. అది నీకు అనుభవంలోనికి వస్తే గురువుతో పనిలేదు. నీకు బేదబుద్ధి ఉందో లేదో, ద్వైతబుద్ధి ఉందో లేదో నీకు నువ్వు చూసుకో. అది లేకపోతే ఏ గొడవలేదు. అది ఉంది అనుకో నీకు గురువు అవసరమే. నీలో ద్వైతము ఉన్నంతసేపు, రాగద్వేషములు ఉన్నంతసేపు గురువు అవసరమూ ఉంది.

నువ్వు ఎవరు అనుకొంటున్నావు. దేహమును అనుకొంటున్నావు. కాబట్టి గురువు అన్నా దేహమే అనుకొంటున్నావు. నీవు దేహానికి పరిమితమై ఉంటున్నావు కాబట్టి గురువునుకూడా దేహమాత్రుడుగానే అనుకొంటున్నావు. అంటే గురువును దేహానికి పరిమితం చేస్తున్నావు. ఆత్మకు పరిమితులు సృష్టిస్తున్నావు అంటే ఆత్మను అవమానపరచినట్లు. నిజం చెప్పాలంటే నీవు దేహము కాదు. గురువు దేహము కాదు. నీవు ఆత్మవే. గురువుకూడా ఆత్మే. మనకు ఆత్మానుభవం కలిగిన వెంటనే బాహ్యంగా కనిపిస్తున్న ఈ గురువు ఆత్మేఅని మనకు తెలుస్తుంది. గురువు అవసరము అని మీరు చెపుతున్నారు. ఫలానావ్యక్తి గురువు అని మనకు ఎలా తెలుస్తుంది అని అడుగుతున్నారు. గురువుగురించి భగవాన్ నిర్వచనం చెపుతున్నారు. ఎవరిని చూడటంవలన నీకు ప్రేమ కలుగుతుందో, ఎవరిని చూడటంవలన నీకు ఆకర్షణ కలుగుతుందో, ఎవరిని చూడటంవలన నీకు శాంతి కలుగుతుందో, ఎవరి సమక్షంలో నీ సాధనతోటి, నీ ప్రయత్నంతోటి సంబంధం లేకుండా వాడి వైబ్రేషన్స్ పనిచేసి నీకు పరమశాంతి కలుగుతుందో అట్టివాడిని గురువుగా పరిగణించవచ్చును. శిష్యునికి సరిఅయిన గురువు దొరక లేదు అనుకోండి ఏమి చేయాలి అని ప్రశ్నించారు. భగవాన్ దీనికిఅందమైన జవాబు చెప్పారు. జన సామాన్యంలో ఎవరికి తగ్గ గురువు వారికి దొరుకుతాడు అని భగవాన్ చెప్పారు. గురువు దొరకడు అని చెప్పలేదు. వారి స్వభావమునుబట్టి, ప్రవృత్తినిబట్టి వారికి తగిన గురువు వారికి దొరుకుతాడు అని చెప్పారు.

సమాజంలో మార్పుగురించి ఒక భక్తుడు అడుగుతున్నాడు. సమాజంలో మార్పు గొడవనీకు ఎందుకు? నీవు మారటానికి ప్రయత్నంచెయ్యి అన్నారు భగవాన్. ఎదుటివారిలో ఏ మార్పు రావాలని కోరుకొంటున్నావో, ఎదుటివారిలో ఏ శాంతి రావాలని కోరుకొంటున్నావో ఆ మార్పును, ఆ శాంతిని, ఆ సుఖాన్ని నీవు తెచ్చుకో.

ఈ సమాజము, సాంప్రదాయాలు ఇవి అన్నీ మనస్సుయొక్క సృష్టి. ఎక్కడయితే మనస్సు ఉందో అక్కడ సృష్టి ఉంది, ఎక్కడయితే మనస్సు లేదో అక్కడ సృష్టిలేదు.

మనిషి బాహ్యముఖానికి అలవాటుపడి ఉన్నాడు. సహజంగా మనస్సు, ఇంద్రియాలు బాహ్యముఖంగా పోతూ ఉంటాయి. సహజంగా నీ హృదయంలో ఉన్న నారాయణుడిని ప్రార్థించే శక్తి ఉంటే బాహ్యమైన దేవతలతోటి నీకు పనిలేదు. ఈ దేవతలకు ఆధారంకూడా నీ హృదయంలో ఉన్న నారాయణుడే. మనుషులకంటే దేవతలకు ఎక్కువ అధికారాలు ఉండవచ్చు. ఇవి అన్నీకూడా కాలప్రవాహములో కొట్టుకొనిపోతాయి. యముడు నచికేశ్వరుడితో నీవు ఆత్మజ్ఞానంగురించి, మృత్యువు గురించి అడుగవద్దు. నీకు గుర్రాలు, ఏనుగులు ఇస్తాను, గొప్ప పదవులు ఇస్తాను, నీకు భోగాలు ఇస్తాను. వాటిని నీచేతిలో పెడతాను వాటిని అనుభవించు. చనిపోయినతరువాత జీవుడు ఏమౌతాడు ఇటువంటి పిచ్చి గొడవలు నీకు ఎందుకు. చావులేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉన్నమాట నిజమే. దానిగురించి అడుగవద్దు. నేను ఇచ్చిన భోగాలు అన్నీ తీసుకో సుఖపడతావు అన్నాడు యముడు. నీవు ఇచ్చినవన్నీ అనుభవిస్తాను. గుర్రాలు, ఏనుగులు ఇస్తానంటున్నావు, బాగానే ఉంది. గుర్రాలు, ఏనుగులు చనిపోతాయి. అధికారాలు ఇస్తానంటున్నావు. అధికారాలుకూడా పోతాయికదా. సూక్ష్మబుద్ధితో, వివేకంతో చూస్తూఉంటే నీవు ఇచ్చేవి అన్నీ కాలప్రవాహములో బొగ్గు అయిపోతాయి. ఇవి అన్నీ నాకు ఎందుకు? శాశ్వతంగా ఉండే వస్తువుగురించి నేను చెప్పమంటూ ఉంటే ఈ ఆకర్షణలు అన్నీ చూపిస్తావు ఏమిటి? ఈ నశించే వస్తువులను నన్ను కోరుకోమంటావు ఏమిటి? అన్నాడు నచికేశ్వరుడు. నీవు భోగాలకు సంబంధించిన వస్తువులనుగురించి చెపుతున్నావు. అనుభవిస్తాను. నువ్వు ఇచ్చిన భోగాలవలన చివరకు నేను ఏమి పొందుతాను, ఆత్మజ్ఞానంగురించి నీవు నాకు చెప్పటంవలన నేను ఏమి పొందుతాను. ఈరెండూ నీవే చెప్పు. నాకు ఏది మంచిదో అదే చెయ్యి అన్నాడు నచికేశ్వరుడు. నచికేశ్వరుడికి ఎన్ని ఆకర్షణలు చూపించాలో అన్ని ఆకర్షణలు చూపించాడు. కాని నచికేశ్వరుడు ఆకర్షణలకు లొంగలేదు. గాయత్రీ మంత్రం ఎటువంటి బుద్ధిని సంపాదించమని ఉపదేశించిందో అటువంటి బుద్ధిని నచికేశ్వరుడు సంపాదించాడు కాబట్టి ఈ ఆకర్షణలు అన్నీ తట్టుకోగలిగాడు లేకుంటే తట్టుకోలేడు. ప్రపంచంలో ఉన్న ఆకర్షణలకు లొంగేవాడు ఆత్మవిద్యకు అర్హుడుకాదు. ప్రపంచంలో ఉన్న ఆకర్షణలకు నచికేశ్వరుడు లొంగలేదు కాబట్టి ఇప్పుడు నీవు అర్హుడవు అయ్యావు. నీకు ఆత్మజ్ఞానం గురించి చెపుతాను అన్నాడు యముడు. అప్పుడు కఠోపనిషత్ చెప్పాడు.

రమణమహర్షిగారు ఎక్కువగా మౌనంగా ఉండేవారు. ఆ మౌనం అత్యంత బలీయమైనది. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి నీకు ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించటానికి మౌనంలో పనిచేసేవారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక M.P. భగవాన్‌ను క్రూయల్ లవర్ అన్నారు. ఈయన ప్రేమికుడేగాని దుర్మార్గం ఉంది అనేవారు. భగవాన్ మనలను ప్రేమిస్తున్నాడు భగవాన్‌ను చూడాలి అని లక్నోలో ఉండగా ఆయనకు అనిపించేదట. ఆయనదగ్గరకు ఆకర్షించుకొనేవాడు. ఆయన మనలను ప్రేమిస్తున్నాడు అన్న సంగతి తెలిసేది. తీరా దగ్గరకు వస్తే మొఖం ప్రక్కకు త్రిప్పేసుకొనేవాడు. అసలు మాట్లాడేవాడు కాదు. ఆ రకంగా ఎందుకు చేస్తున్నాడో అన్నారు. ఈయనలో ఉన్న ఏ సంస్కారములు తొలగించటానికి భగవాన్ మొఖం ప్రక్కకు పెట్టుకొన్నారో ఈయనకు తెలియదు. ఒకోసారి ఎదురుగా కూర్చొన్నవారితో మాట్లాడేవారు కాదు. చివరకూర్చొన్నవారిని పిలిచి మాట్లాడేవారు. ఎవడితో ఏరకంగా వ్యవహరిస్తే వాడి వాసన మంటపెట్టటానికి అవకాశం ఉంటుందో ఆరకంగా ప్రవర్తించేవాడే గురువు. బాహ్యమైన గౌరవాలు, సత్కారాలు, పురస్కారాలుతోటి నిజమైన గురువుకు పనిలేదు. ఎవడితో ఎలా ప్రవర్తించినా వాడిలోని వాసనను బయటకు తీసి మంటపెట్టటానికి గురువు చేసే ప్రయత్నమేగాని అది అనుగ్రహమేకాని ఆగ్రహంకాదు.

ఒకవేళ ఆగ్రహం క్రింద బయటకు కనిపించినా అదికూడా అనుగ్రహమే అన్న సంగతి గ్రహించిన భక్తుడు ధన్యుడు. మనలను ఒక చెట్టుకు తాళ్ళతో కట్టారనుకోండి. ఇతరుల సహాయంతో ఆతాళ్ళను నరికించి పారిపోవచ్చు. గురువుకూడా తాళ్ళతో మనలను కడతాడు. కాని గురువు కట్టినతాళ్ళు మన కళ్ళకు కనబడవు. అందువలన వాటిని మనం తొలగించుకోలేము. ఇతరుల సహాయంతోకూడా తొలగించుకోలేము. ఆత్మశాంతి కలిగేవరకూ, ఆత్మానుభవం కలిగేవరకూ జన్మజన్మలు మనతో ప్రయాణం చేసి తన స్వరూపమును ఇచ్చేవరకూ మనలను విడిచిపెట్టడు వాడు గురువు. గురువుయొక్క ప్రేమ అటువంటిది.

అహంభావన నీలోపల సూక్ష్మరూపంలో నేను అనే తలంపు రూపంలో ఉంది. ఈ తలంపు రూపములో ఉన్నప్పుడే ఈ నేను అనే తలంపు ఎక్కడనుండి వస్తోంది అని వెనక్కి వెళ్ళి దానిమూలాన్ని తెలుసుకుంటే అది చనిపోతుంది. లోపల సూక్ష్మరూపంలో, తలంపు రూపంలో ఉన్న అహంభావన బయటకు వచ్చి దేహంతో, ఇంద్రియాలతో, రంగులతో, మతాలతో, ప్రపంచముతో అన్నింటితో తాదాప్యం చెందిపోయి ఈ bad smell అంతటకీ కారణం అవుతుంది. అహంభావన లోపల చిన్న తలంపు రూపములో ఉంది అని మీరే చెపుతున్నారు కదా ఇంత గొడవచేస్తోంది ఏమిటి అని భగవాన్‌ను అడిగారు. మర్రి విత్తనం ఎంత సూక్ష్మంగా ఉంటుంది. సూక్ష్మంగా ఉన్న మర్రి విత్తనంలోనుండి ఇన్ని ఆకులు, కొమ్మలు, ఇంత పెద్ద చెట్టు ఎలా వస్తోందో అలాగే ఈ నేను అనే తలంపు విజృంభించేటప్పటికి ఈ లోకాన్ని, ఈ లోకంలో ఉన్న గొడవలను అంతా సృష్టించేస్తుంది. నేను అనే తలంపు లేకుండా స్వతంత్రముగా ఉండే శక్తి ఈ దేహానికి, సంసారానికి, ప్రపంచానికి దేనికికూడా లేదు. వీటి అన్నింటికి ఆధారము నేను అనే తలంపే. నేను అనే తలంపు అణిగిపోయినపుడు ఇవి అన్నీ అణిగిపోతున్నాయి. ఈ గొడవలు అన్నీ నేను అనే తలంపు లోనుండి వస్తున్నాయి. దానిమూలం తెలిస్తే ప్రకృతిని దాటిపోవచ్చును.

నేను అనే తలంపును అట్టే పెట్టుకొని ప్రపంచములో మీరు నొల్లుకొనే జ్ఞానం అంతా సాపేక్షిక జ్ఞానము. మాయ ఎక్కడ ఉందంటే మనస్సు అనేక విషయాలు తెలుసుకొంటూ ఉంటుంది కాని నీవు ఎవరో నీవు తెలుసుకో అని మనస్సును అడిగితే అది తెలుసుకోదు. మనోనాశనానికి ప్రయత్నం చేయకుండా మనస్సుతో ప్రపంచంలోని విషయాలను సేకరిస్తూఉంటే నీ మనస్సు ఎంతనిజమో నీ మనస్సుతో సంపాదించిన జ్ఞానంకూడా అంతే నిజం. ఇది అంతా సాపేక్షిక జ్ఞానము. దీనివలన నీకు జ్ఞానం రాదు. ఎవడైతే శరీరం మరణించిన తరువాత ఇతరలోకాలకు వెళ్ళటానికి ప్రయత్నంచేస్తున్నాడోవాడిలో నుండి విడుదల పొందటమే మోక్షం: కైలాసంలో ~~అయితే వాడిలోనుండి విడుదల పొందటం ఎందుకు మనకు~~ ఆ సుఖం ఉంది, వైకుంఠములో ఈ సుఖం ఉంది అని చెపుతారు. ఇవి అన్నీ మన మనస్సు వింటుంది. ఎప్పుడు అక్కడకు వెళ్ళిపోదామా అని కనిపెట్టుకొని ఉంటుంది. చనిపోయిన తరువాత ఆలోకాలకు వెళ్ళి భోగాలు అనుభవించటంకోసం ఏ పుణ్యం చేస్తే బాగుంటుంది అని ఆ పుణ్యం ఇక్కడ చేసేస్తావు. ఆ భోగం అనుభవించేవాడు ఎవడు అనే ప్రశ్నరావటం లేదు. ఈ భోగాలన్నింటికి కృష్ణుడు మోహకలిలం అనిపేరు పెట్టాడు. ఎవడిబుద్ధి అయితే ఈ మోహకలిలంలోనుండి బయటపడిందో వాడికి వైకుంఠములో ఈ భోగాలు ఉన్నాయి అని చెప్పినా వాడు ఏమి ఆకర్షింపబడడు. అందులో ఏమి సారం లేదని వాడికి తెలుస్తూ ఉంటుంది. మాయయొక్క ఆటలు అక్కడ సాగవు. మోహకలిలంలోనుండి బయటకు వచ్చినవాడికి ఇది అంతా పెంట అనిపిస్తుంది. దేహం కనిపించినపుడు పుట్టుక అంటారు. దేహం కనిపించనపుడు మరణం అంటారు. నేను అనే తలంపు ఇటువంటి దేహాలు ఎన్ని లక్షలు దేహాలు వచ్చినాయో.

మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. వాడు నిజంకాబట్టి వాడు అందరి హృదయములోనూ ఒక్కటిగానే ఉన్నాడు. సమానంగా ఉన్నాడు. ఏదైతే నిజంకాదో అది ఒకటిగా ఉండదు. అనేకంగా ఉంటుంది. ఇక్కడ

ఎంతమంది మనుషులు ఉన్నారో అన్ని రకాల అహంకారములు, అన్నిరకాల మతాలు, అన్ని రకాల గుణాలు, అన్ని రకాల వికారములు. ఇవి అన్నీ అబద్ధాలు కాబట్టి అనేక రకములుగా ఉన్నాయి. మీకు ఏదైనా రోగం వచ్చింది అనుకోండి, ఆ రోగమును తగ్గించేమందు మీ దగ్గర ఉంటే కంగారు పడనక్కరలేదు. అలాగే మీకు ఎన్ని కష్టాలు, నష్టాలు, ఇబ్బందులు వచ్చినా మీరు బాధపడనక్కరలేదు. జ్ఞానం అనే మందు మీ దగ్గర ఉంటే ఏ గొడవా లేదు. మీకు జ్ఞానం ఉంటే మీకు వచ్చిన కష్టం కష్టంలాగ కనపడదు, నష్టం నష్టంలాగా కనపడదు. జ్ఞానమే నివారణ చేసేస్తుంది. అబద్ధం వేసే గంతులు చూసి నిజం కంగారు పడదు. ఎవడైతే తన హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకున్నాడో వాడిని ఈ అహంకారము కంగారు పెట్టినా కంగారుపడడు. ఇవి అన్నీ నిజం కాదని హృదయంలో ఉన్న నిజానికి తెలుసు అందువలన అది కంగారుపడదు. ఎవడినైతే అహంకార పిశాచము పట్టుకొందో వాడు నామ పిశాచాన్ని, రూపపిశాచాన్ని పట్టుకొంటాడు. అహంకార పిశాచమునుండి బయటకు వచ్చినవాడికి నామ, రూప పిశాచములతోటి సంబంధం లేదు.

నీ హృదయంలో ఒక నిజం ఉంది. అదే సత్యం, అదే నిత్యం, అదే సర్వం. నీ హృదయంలో ఉన్న నిజంలో మేలుకోవాలంటే నీకు ఇష్టంఉన్నా, లేకపోయినా, దేహబుద్ధిని అంటే అజ్ఞానాన్ని విడిచిపెట్టితీరవలసిందే. నీవు దేహమునకు, మనస్సుకు, ఇంద్రియాలకు వీటి అన్నింటికి పరిమితమై ఉంటున్నావు. ఇదే మాయ. పరమేశ్వరుని అనుగ్రహం ఏ జీవుడికైతే కలిగిందో వాడు మాత్రమే ఆ గొడవలోనుండి బయటకు రాగలడు.

అహంభావన నాలో ఉందా, లేదా అని నాకు ఎలా తెలుస్తుంది. నాకు జ్ఞానం వచ్చిందా లేక నేను ఇంకా అహంభావనలోనే ఉన్నానా అని చూసుకోవటానికి కొన్ని గుర్తులు చెప్పమని అడుగుతున్నాడు. నీ హృదయంలో ఉన్న జ్ఞానము పవిత్రంగా ఉంటుంది. బాహ్యంగా వచ్చే ఏ ప్రకోపానికి అది చలించదు. అది జ్ఞానము. నీ హృదయంలో ఉన్న వస్తువు ఏకంగా ఉంటుంది, శాంతంగా ఉంటుంది, నిదానంగా ఉంటుంది, స్థిరంగా ఉంటుంది. సృష్టిపరంగా వచ్చే ప్రకోపాలకు దేనికికూడా అది చలించదు ఎందుచేతనంటే సృష్టికి దానికి సంబంధంలేదు. సృష్టిలో ఏ ప్రకంపము వచ్చినప్పటికీ, ఎన్ని హెచ్చుతగ్గులు వచ్చినప్పటికీ హృదయంలో ఉన్న నిజం చలించదు. అలా నీవు చలించకుండా ఉన్నావంటే జ్ఞానంయొక్క వలయంలో ఉన్నావని గుర్తు అని భగవాన్ చెపుతున్నారు. నీకు ఏదైనా వచ్చినపుడు భయం కలుగుతోంది అనుకో, ఇష్టము అయిష్టము కలుగుతోంది అనుకో, కోరిక వస్తోంది అనుకో, మనస్సుకు చలనం కలుగుతోంది అనుకో నీలో అపవిత్రత ఉన్నట్లు గుర్తు. నీలో అపవిత్రత లేదు అనుకో దేనికీ నీవు చలించవు. అపవిత్రత అహంభావనను అంటిపెట్టుకొని ఉంటుంది. బాహ్యంగా వచ్చే హెచ్చుతగ్గులకు నీ అహంభావన చలిస్తుంది గాని నీలో ఉన్న నిజం చలించదు. సర్వకాల సర్వావస్థలలో నీవు చలించకుండా ఏకంగా ఉండగలిగితే నీవు జ్ఞానానికి సమీపంలో ఉన్నట్లు గుర్తు. ప్రతి చిన్న విషయానికి అంటే వ్యక్తిపరంగా కాని, సమాజపరంగా కాని, సంసారపరంగా కాని నీలో వేదన, రోదన, కంగారు పుడుతూ ఉంటే నీలో అహంభావన ఉన్నట్లే. భగవాన్ జీవితంలో దేనికీ ఆశ్చర్యపడలేదు. ఎక్కడైనా భూకంపం వచ్చింది అని మనతో చెప్పారు అనుకోండి మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఇదే వార్త భగవాన్‌తో చెపితే ఆ వార్త వినకముందు ఆయన మొఖం ఎలాఉందో విన్నతరువాతకూడా అలాగే ఉండేది. ఎందుచేతనంటే effect అయ్యే వస్తువు అంటే అహంభావన అక్కడలేదు. మనలో effect అయ్యేవస్తువు ఉంది కాబట్టి కంగారు వస్తోంది, దుఃఖం వస్తోంది. అపవిత్రతకు ఆందోళన వస్తుందిగాని పవిత్రతకు ఆందోళన రాదు.